# నిద్ర

–వి. లక్ష్మీసుజాత

సాయంత్రం అవుతోంది. తోటమాలి మొక్కలకు నీళ్ళు
పెడుతోంటే చూస్తూ కుర్చీలో కూచున్నాను. వరాలు టీ తీసు
కొచ్చింది. అసలే నిద్రపట్టక చస్తోంటే, అది అలవాటు
ప్రకారం టీ తెచ్చింది. తీసుకున్నాను. అవుట్ హౌస్‌లో వుంటు
న్న తోటమాలి తాలూకు రేడియోలోంచి ''జీవితమున సగ
భాగం నిద్దురకే సరిపోవు. మిగిలిన ఆ సగభాగం చిత్తశుద్ధి
లేకపోవు'' అంటూ ఘంటసాల గొంతు వినబడుతోంది. చిత్త
శుద్ధి సంగతి దేవుడెరుగు, నాకు నిద్రలేకుండా పోయి చాలా
రోజులవుతోంది. ఇదేదో సడన్‌గా వచ్చిపడిన జబ్బు కాదు.
నెమ్మది నెమ్మదిగా నిద్రపోయే టైమ్ తగ్గుతూ వచ్చి, ఇప్పుడు
పూర్తిగా తగ్గిపోయింది.

రాత్రీ పగలూ ఎప్పుడూ మెలకువే! రాత్రంతా
ిలా పొడికళ్ళతో సీలింగ్ చూస్తూ పడుకోవడమే!
ల్లవారు జామున ఏ నాలుగింటికో, అయిదింటికో
న్న మగత! ఆరింటికల్లా టక్కున లేచి కూచోవ
మే! మధ్యాహ్నం భోజనం తర్వాత కునుకు తీద్దా
ని ప్రయత్నించినా లాభం లేకపోయింది. అనా
గ్యమా అంటే అదీ లేదు.

మానసిక సమస్యలేవీ లేవు. నా భర్త పెద్ద బిజినెస్
ాగ్నెట్. ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీకి
ర్మన్. నా పెద్ద కొడుకు ఎం.డి. కోడలు మా కంపెనీ
నే ఛార్టెడ్ అకౌంటెంట్. నా కూతురూ, అల్లుడూ
మెరికాలో డాక్టర్లు. నా చిన్న కొడుకంటారా –
ఫెన్స్ మినిస్ట్రీలో పెద్ద పోస్టులోనే ఉన్నాడు. ఆఫీసు
షయాలు తప్పించి ప్రతి విషయంలోనూ నన్ను
ంప్రదించనిదే మా వారు ఏ నిర్ణయం తీసుకోరు.

భాగ్యనగరంలో ఖరీదైన ప్రాంతంలో అతి ఖరీ
న ఇల్లు! ఎటు చూసినా డబ్బు. డబ్బు గల ఆడ
వాళ్ళంతా మెంబర్లుగా వుండే లేడీస్ క్లబ్బుకి నేను
సెక్రెటరీని. ఆ క్లబ్బు నిర్వహించే కార్యక్రమాలకు
డబ్బు వెదజల్లడం తప్ప నేను చేసే పనేమీ ఉండదు
అక్కడ. ఆ క్లబ్బులోకి నేను అడుగు పెట్టగానే, ఆప్యా
యత ఒలకబోస్తూ, కావిలించుకుని మర్యాదలు కురి
పించే వాళ్ళంతా లోలోపల ''రెండు చేతులా మొగు
డు సంపాదిస్తున్నాడనీ, పిల్లలు స్టేట్స్‌లో ఉన్నారనీ,
దీనికెంత విరగబాటో'' అనీ ''ఎవర్ని దోచి పెడుతు
న్నదోగానీ, వచ్చినప్పుడల్లా కొత్త నగలు పెట్టుకొస్తుం
ది'' అనీ నా గురించి అనుకుంటారని నాకు తెలుసు.
నాకు తెలుసని వాళ్ళకి తెలుసు. అందరూ కాసేపు ఏ
అంతర్జాతీయ మహిళా సదస్సులోనో ఎవరో ఒక
ఫెమినిస్టు ఏ ఉపన్యాసం దంచిందీ కాసేపు చర్చించి,
మోనికా లెవిన్‌స్కీ శృంగార చేష్టల కబుర్లలోకి దిగు
తారు చివరికి! ఈ కబుర్ల పట్ల నాకేం ఆసక్తి లేనప్ప
టికీ, అక్కడికి వచ్చే వాళ్ళంతా నా ఆధిపత్యాన్ని అంగీ
కరించడం నాకు ఆనందాన్ని కలిగిస్తుండడం వల్లనే
ఆ క్లబ్బుకి వెళ్తూ ఉంటాను.

మరి ఇంకేమిటి సమస్య?

ఆలోచనలతో తల బద్దలవుతోంది.

పోనీ నాకు తెలియకుండానే నాలో ఏదైనా అసం
తృప్తి రేగుతోందా?

ఉలిక్కి పడ్డాను. ఛ! ఇలా ఆలోచిస్తున్నానేమిటి?
నాకే అసంతృప్తులూ లేవు. ఎవ్రీథింగ్ ఈజ్ ఆల్‌రైట్.

మొదట్లో నాకు నిద్రపట్టడం లేదన్న సంగతి విని
మా వారు ఒకటే నవ్వు!

''నువ్వు హాయిగా నిద్రపోతావు లక్ష్మీ. నాకు
తెలీదా ఏం'' అన్నాడు.

నాక్కోపం వచ్చింది.

''ఏం తెలుసు మీకు? పడుకున్నారంటే తెల్ల
వారే దాకా కనీసం పక్కకి కూడా తిరగరు. నేన్నిద్రపో
యానో లేదో మీకు తెలుస్తుందా పాపం'' అన్నాను
కోపంగా!

''పగలు నిద్రపోకండత్తయ్యా'' సలహా ఇచ్చింది
నా కోడలు.

పగలల్లా ఆఫీసులో వుండే దానికేం తెలుసు పగ
లంతా నేను క్షణం కూడా కునుకు తీయనని!

''ఒక పని చెయ్యి, పార్టీల్లో ఎప్పుడైనా బీర్
తీస్కుంటావుగా! రోజూ రెగ్యులర్‌గా వైన్ కొద్దిగా
తీసుకుని చూడు'' అన్నారు మా వారు.

ప్రయత్నించి చూశాను! లాభం లేదు.

''బెడ్ స్థలం మార్చి చూడమ్మా ఒక్కోసారి అలా
చేస్తే నిద్ర పడుతుంది'' అన్నాడు మా అబ్బాయి.

''అమ్మో, అలా అయితే అమ్మకి నిద్ర పడుతుం
దేమోగాని నాకు పట్టదు'' గోలపెట్టారు మా వారు.

మరో పది రోజులు గడిచాక ఫామిలీ డాక్టర్ దగ్గరి
కెళితే, ఆవిడ యథాప్రకారం ఏవో టెస్టులు చేసి నిద్ర
మాత్రలు ఇస్తూ ''ప్రాబ్లెం ఏమీ లేదండి. మరెందు
కిలా అవుతోంది మీకు'' అని నేనడగాల్సిన ప్రశ్న
నన్నడిగింది.


సరే. అయిందా, ఆ మాత్రలు వాడితే నిద్ర
లాంటి మత్తు ఆవరించేది. ఆ తర్వాత రోజు పగ
లంతా మత్తుగా తలదిమ్ముగా ఉండేది. నిద్ర లేచిన
హాయి వుండేదికాదు. వారంలోపే వాటి వాడకానికి
ఫుల్ స్టాప్ పెట్టాను. సలహాలు కుప్పలుగా వచ్చి
పడ్డాయి.

''స్పైసీ ఫుడ్, ఫాటీ ఐటమ్స్ మానెయ్యండి.''

''కాఫీ టీలు మానెయ్యండి.''

''ఎక్కువ ఆలోచించొద్దు లక్ష్మీగారూ, అయినా
మీకేం ఆలోచన్లొస్తుంటాయి లేద్దూ.''

''పడుకోబోయే ముందు పుస్తకం ఏదైనా చద
వండి.''




''రోజా ఒకే టైమ్‌కి పడక చేరండి.''

''డు సమ్‌థింగ్ విత్ మిస్టర్ విజయ్ బిఫోర్ యు గో టు బెడ్'' (విజయ్ అంటే మా ఆయనే లెండి)

''మంచి సంగీతం వినండి! ఈ మధ్య స్ట్రెస్ రిలీఫ్‌కి మంచి కాసెట్లు వచ్చాయి కూడా.''

ఇవన్నీ అదివరకే నేను ఆచరించి వుండడం వల్ల పక్కన పెట్టాను.

''పడుకోబోయే ముందు పాలు తాగమ్మా! పాలల్లో Tryptophan అమైనో ఆసిడ్ నిద్ర తెప్పించేందుకు తోడ్పడుతుంది'' ఫోన్లో మా అమ్మాయి సలహా ఇచ్చింది.

''అసలు ఏదైనా హిల్‌స్టేషన్‌కి వెళ్దాం పద కొద్ది రోజులు'' అన్నారు మా వారు.

మహాబలేశ్వర్‌లో కంపెనీ గెస్ట్‌హౌస్ వుండడం వల్ల అక్కడికి వెళ్ళాం. రోజంతా ప్రకృతి అందాలు చూసి పరవశించి పోయానుగాని, రాత్రిపూట మాత్రం యథాప్రకారం సీలింగ్‌కేసి చూస్తూ గడపటమే!

❑❑❑

''ఏమిటి లక్ష్మీ ఇది. అమ్మాయినీ, అల్లుడినీ రమ్మని ఫోన్ చేస్తాను, పర్సనల్ కేర్ తీసుకుని చూస్తారు'' అన్నారు మా వారు కంగారు పడిపోతూ.

''చాల్లెండి ఎవరన్నా వింటే నవ్వుతారు'' వారించాను.

అప్పుడు వచ్చాడు మా తమ్ముడు పల్లెటూరు నుండి! ప్రకాశం వాడి పేరు. వాడు అగ్రికల్చరల్ ఎమ్మెస్సీ చదివి, మా నాన్న ఇచ్చిన పాతిక ఎకరాల భూమినీ స్వయంగా సాగుచేస్తూ దాన్ని నలభై ఎకరాలు చేశాడు. అక్కడే స్థిరపడిపోయాడు. పిల్లలిద్దరూ ఈ ఊర్లోనే హాస్టల్లో వుండి చదువుకుంటున్నారు. దసరా సెలవులకి పిల్లల్ని తీసుకెళదామని వచ్చారుట. నా సంగతి విని వాడు పెద్దగా నవ్వాడు.

''మా ఊరు రావే! నీకెందుకు నిద్రరాదో నేను చూస్తా'' అన్నాడు.

''పోరా నీ చచ్చు సలహా నువ్వూ! మీ ఊరంటావే కొత్తగా! నా ఊరు కాదా! అక్కడికి తీసుకుపోయి ఏ మత్తింజెక్షనో చెయ్యవు కదా'' అన్నాను.

''చెయ్యన్లేగానీ, ఊరికే, కొంచెం గాలి మారితే ప్రయోజనం ఏమైనా ఉంటుందేమో చూద్దామే! ఇంకేంలేదు. బావా దీన్ని నాతో పంపండి! కారు కూడా తెచ్చాను, మీ ఆవిడేం కందిపోదు'' అన్నాడు వాడు.

''వడ్డించాను రండమ్మా'' వంటావిడ రావడంతో ప్రకాశం వింతగా చూసి ''నీ వంటలు తప్పితే మింగరని గొప్పలు చెప్పుకుంటావుగదే ఇదేంటి'' అన్నాడు.

''ఆ మధ్య క్లబ్బు పనుల్లో కొంచెం బిజీగా వుండి పెట్టుకున్నాన్రా! వంటలు అందరికీ బాగా నచ్చాయి! ఉంచేశాను'' అన్నాను.

ప్రకాశం ఒక్కక్షణం ఆగి నవ్వాడు. నేనది పట్టించుకోకుండా లేచాను.

మొత్తానికి ఆ రోజు సాయంత్రం ప్రకాశంతో పాటు పూలపాలెం వెళ్ళడానికి కష్టం మీద అందరూ ఒప్పుకున్నారు. మా వారు లక్ష జాగ్రత్తలు చెప్పి మందుల కిట్ సర్దారు. మర్చిపోతానేమోనని ఆయనదీ, మా వాడిదీ సెల్ నంబర్లు నా డైరీలో రెండు మూడు చోట్ల రాసి కార్లో పెట్టారు.

❑❑❑

అరుంధతి ఆశ్చర్యంతో ఎదురొచ్చింది. ''అమ్మో తుఫానేవన్నా వస్తుందా ఏవిటమ్మాయ్'' అంటూ!

తమ్ముడి ఇల్లు చూసి ఆశ్చర్యంతో నిలబడిపోయాను. మా నాన్న ఇచ్చిన ఇల్లును కొంచెం పెద్దది చేశాడంతే! ''ఇల్లు రీమోడల్ చేశాను'' అంటే పడగొట్టి కట్టాడనుకున్నాను – మా అత్తగారిచ్చిన మేడని మేం పడగొట్టినట్టు, నా చిన్నప్పటి బాదం చెట్టు




పచ్చగా కాంతులీనుతోంది. ఇంటి ముందు అన్నీ పూలచెట్లే! మల్లెలు, మందారాలు, సన్నజాజులు, గులాబీలు, నందివర్ధనం, రాధా మనోహరం, నూరు వరహాలు - రంగురంగుల్లో అందంగా తోట. నాకు సినిమాల్లో లాగా - వెంటనే మా ఇంటి ముందు గార్డెన్ గుర్తొచ్చింది. ఎక్కడెక్కడి నుంచో తెచ్చి పెంచిన క్రోటన్స్, క్రమం తప్పకుండా కత్తిరించబడే కొమ్మలూ, విత్తనాలు వేసి మరీ పెంచిన లాన్‌లో గడ్డి! కాక్టస్! తెప్పరిల్లి లోపలికి నడిచాను అరుంధతి భుజం చుట్టూ చేయివేసి.

పిల్లలిద్దరూ కార్లో నా మీద పడి రాత్రంతా బండల్లా నిద్రపోయింది చాలక, వెళ్ళగానే సోఫాలో ఒకళ్ళు, ఉయ్యాల బల్ల ఎక్కి ఒకళ్ళు నిద్రలో పడ్డారు.

అరుంధతి చిక్కని కాఫీ ఇస్తూ ''రాగానే విశేషాలేం చెప్తావు కానీ స్నానం చేసి పడుకో వదినా. రాత్రంతా నిద్రలేదో ఏమో'' అంది.

''నేనూ సరే నా నిద్రా సరే'' అనుకుంటూ స్నానానికి వెళ్ళాను.

వరాలు కుంకుడు పులుసు గిన్నెలో మందారాకులు వేసి తెచ్చి ఇచ్చింది. కుంకుళ్ళనే మాట ఏనాడో మర్చిపోయాను. కానీ కుంకుళ్ళతో తలస్నానం చేశాక బరువంతా వదిలిపోయి తేలిగ్గా అనిపించింది.

వచ్చేసరికి నిప్పులు, సాంబ్రాణి రెడీగా ఉంది. నాలుక్కర్చుకున్నాను. కమ్మని సాంబ్రాణి సువాసన నా జుట్టులోంచి గదంతా వ్యాపిస్తుంటే సుఖంగా అనిపించింది.

పదవుతోండగా ప్రకాశం పొలంనుంచి వచ్చాడు. వస్తూనే కోపంతో మండిపడుతూ ''ఆ బంతి నారే మన్నా వాడేదుందా లేదా? మళ్ళు రెండుగా ఎప్పుడో రెడీ అయిపోయాయి కదా'' అని విరుచుకుపడ్డాడు.

నాలుక్కర్చుకుంది అరుంధతి...

''ఇవాళ పొద్దున్నే వెళదామనుకున్నానండీ! మీరొచ్చేసరికి మర్చిపోయాను.

ఒక పని చేస్తాను. పనులు అయిపోయాయి. నేను వెళ్తాను పొలానికి, గంటా రెండు గంటల్లో పనైపోతుంది! ఏం వదినా వస్తావా సరదాగా! పోనీ పడుకుంటావా'' అంది.

విషయమేమిటంటే, పొలంలో రెండు మడుల్ని బంతి తోటకోసం అట్టి పెడతాడు ప్రకాశం ఏటా! ధనుర్మాసమంతా చెన్నకేశవస్వామి ఆలయానికి బంతిపూలు రోజూ బుట్టలతో పంపుతారు వీళ్ళే! సంక్రాంతి రోజు ఊరంతా పంచుతారు! ఆ మళ్ళలో బంతి మొక్కలు అరుంధతే నాటాలని ప్రకాశంగాడి సెంటిమెంటు. కనీసం ఒక మడన్నా నాటాలట. ప్రతిసారీ రెండు రోజుల్లో పని పూర్తి చేస్తుందట. ఈసారి పనుల్లో పడి ఈ సంగతే మర్చిపోయింది - అదీ వాడి ఎగురుళ్ళకి కారణం.

నేనూ, అరుంధతి, పిల్లలూ బండిలో పొలం వెళ్ళాము. పెద్ద పాలేరు పర్యవేక్షణలో వరినాట్లు సాగుతున్నాయి. మధ్యలో ఒక చిన్న మడిలో పచ్చగా ఎదిగి ఆరోగ్యంగా కళకళ లాడుతున్నాయి బంతి మొక్కలు. దున్ని, చాళ్ళు వేసి ఎరువు చల్లిన మడులు రెడీగా ఉన్నాయి. కనుచూపు మేరలో అంతా ఆకుపచ్చదనం. చేలగట్ల మీద వరసగా కొబ్బరి చెట్లు.

అరుంధతి ఒక కట్ట మొక్కలు తీసుకుని మడిలోకి దిగింది.

''నేనూ రానటే'' అడిగాను ఉత్సాహంగా!

''రా మరీ''

మడిలోకి దిగి మడిలో ఆ చివరి నుండి ఈ చివరికి రెండు వరసలు నాటేసరికి నడుం పడిపోయినంత పనైంది. కాసేపు నిటారుగా నిలబడి, మళ్ళీ మొదలు పెట్టాను. అరుంధతి చకచకా ఆరు వరసలు నాటేసింది అప్పటికే! నాకు ఆయాసం వస్తోంది. గట్టెక్కే ప్రయత్నంలో వుండగా ''అయ్యో అప్పుడేనా, అత్తయ్యేదో పొడిచేస్తుందనుకున్నానే'' అన్నాడు ప్రకాశంగాడి సుపుత్రుడు.

''అత్తయ్యను అంతలేసి మాటలనకండ్రా పాపం అలవాటు లేదుకదా! పోనీ వెళ్ళి కూర్చో వొదినా'' అంది అరుంధతి. నాకు ఉడుకు మోత్తనం ఒచ్చింది.

''హాయిగా నాటేస్తాను. మంచినీళ్ళు తాగాలని గట్టెక్కుదామనుకున్నాను'' అబద్ధమాడాను. ఐదు నిమిషాల్లో కొబ్బరి బోండాలు దింపారు. చల్లగా తీయగా ఆ నీరు గొంతులోకి దిగుతోంటే ఎన్నితాగినా తనివి తీరదనిపించింది. మరో పది వరసలు నాటేసరికి ఒంటిగంటయింది. చెమటలు కారిపోతున్నాయి, ఒక పక్కనుంచి చల్లగాలి వీస్తున్నా! అంతలో నన్ను రక్షించడానికన్నట్టు ఇంటి నుండి కారేజీ వచ్చింది. దాన్ని చూస్తూనే కడుపులో ఆకలి కరకరమంది. పొద్దున్న తిన్న పెసరట్లేమైపోయాయో!

''ఇక నా వల్ల కాదర్రా మీరేమైనా అనుకోండి'' గబుక్కున గట్టెక్కాను. నా ఊహ తెలిసి ఇంత కష్టం ఎప్పుడూ చెయ్యలేదు.

కానుగ చెట్టు కింద రెల్లుపాక వేసుంది. కాపలాకి వచ్చే పాలేర్ల కోసం గాబోలు. పక్కనే బోరింగ్ పైపు, మోటారు గది. పైపులోంచి దూకే చల్లని నీళ్ళతో మొహం కడుక్కుంటుంటే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయింది.

గోంగూర పప్పు, వంకాయ కూర, పుదీనా పచ్చడి, మీగడ పెరుగుతో భోజనం ముగిసింది. అరుంధతి పని వాళ్ళతో ఏదో మాట్లాడుతోంది. చేయి కడుక్కుని అటూ ఇటూ తిరుగుతూ పాకలోకి నడిచాను. అక్కడొక కుక్కి నులక మంచం కనబడింది. నడుం నొప్పిగా అనిపిస్తూ ఉండటం వల్ల ఆ కుక్కిలోనే జారగలబడి వెనక్కి వాలాను. చక్కలిగింతలకి నవ్వాపుకోలేని పడుచు పిల్లలగా గాలి తుళ్ళిపడుతోంది. నాట్లు వేస్తూ ఎవరో ఏదో పాటందుకున్నారు.

తెలియని హాయేదో శరీరాన్ని ఆవరిస్తోంది. సుఖమైన హాయి. నాకు తెలియకుండానే నా చేయి తల కింద పెట్టుకున్నాను. కొబ్బరాకులు టపటప లాడుతుంటే, రివ్వున వీచిన గాలి కానగ పూలని విసురుగా నా మీద రాలుస్తుంటే నెమ్మదిగా, నా కనురెప్పలు మూతలు పడిపోయాయి. తిరిగి కళ్ళు తెరిచేసరికి పొద్దు పడమరకి వాలింది. నాట్లకి వచ్చిన కూలీలంతా పైపు దగ్గర కాళ్ళు, చేతులు కడుక్కుంటున్నారు. కళ్ళెదుట ఉన్నదంతా నేనెరగని వింత ప్రపంచంలా తోస్తోంది. అరుంధతి ఇంటికెళ్ళి పోయినట్టుంది. పిల్లలు పాలేరుతో మాట్లాడుతున్నారు. ఆ కుక్కి మంచంలోంచి లేవబుద్ధి కాలేదు. శరీరమంతా తేలిగ్గా హాయిగా ఉంది, పది లంఖణాల తరువాత కారప్పొడితో వేడన్నం తిన్నట్టుంది! దాహంతో గొంతు తడారిపోతుంటే కొత్తకుండలోని చల్లని నీళ్ళు తాగినట్టుంది. సుఖంగా హాయిగా వుంది. సంతృప్తిగా వుంది. ఆ కూలీల నవ్వు మొహాల్ని, ఆ మొహాల్లో మెరిసే సంతోషాన్ని చూస్తుంటే నా 'అసంతృప్తి' ఏమిటో చటుక్కున బోధపడింది.

'శ్రమ తెలియని కృత్రిమ జీవనం!' అవును! నేను చేసే పని ఏముందసలు?

అవును! వాళ్ళు జీవిస్తున్నారు! నేను బ్రతుకుతున్నాను.

నా జీవన విధానాన్ని సంస్కరించుకోవలసిన అవసరం వుందనే సత్యం ఆ క్షణాన నాకవగతమైంది. కర్తవ్యం బోధపడింది.

ఎంత అర్రులు చాచాను ఇటువంటి సుఖనిద్ర కోసం! పరిష్కారాన్ని ఎదురుగా ఉంచుకుని, దీన్నొక సమస్యగా తయారు చేశాను! ఇన్నాళ్ళూ నిద్రలో వున్నాను.

❑❑❑

రెండు రోజుల తర్వాత ఇంటికి ఉత్తరం రాశాను. (ఫోన్ చేయలేదు)

''ఇక్కడ మరో వారం ఉండి బయల్దేరతాను. అన్నట్టు మన ఇంటి వెనుక ఉన్న వెయ్యి చదరపు గజాల స్థలాన్ని అలాగే ఉంచండి. ఆ పక్క ప్లాటు మనకి ఇస్తానన్న రామేశ్వర్‌ని కలిసి ఎలాగైనా తీసుకోండి. అక్కడ ముందనుకున్నట్టు మన బిల్డర్స్ అపార్ట్‌మెంట్స్ కట్టబోవడం లేదు. ఆ మొత్తం స్థలంలోనూ నేను నర్సరీ పెడుతున్నాను. వచ్చాక వివరాలు చెబుతాను. ఇంకో విషయం - ఇక్కడ నేను సుఖంగా నిద్రపోతున్నాను.''


ఆంధ్రజ్యోతి

సచిత్ర వారపత్రిక

## రంజని-కుందుర్తి అవార్డు: 1999

వచన కవితా పితామహుడు కుందుర్తి సంస్మరణలో భాగంగా 1984 నుంచీ పదిహేనేళ్లుగా నిరాటంకంగా ప్రతి ఏటా యువకవులను, కవయిత్రులను ప్రోత్సహించేందుకు 'రంజని' ఏ.జి. ఆఫీసు, తెలుగు సాహితీ సమితి 'రంజని – కుందుర్తి అవార్డు' పేరిట జాతీయ స్థాయితో తెలుగులో వచన కవితల పోటీ నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం రంజని, 'ఆంధ్రజ్యోతి వార పత్రిక'తో కలిసి, సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తోంది.

★ **1999 మొత్తం అవార్డు సొమ్ము 2,500 రూ.లు.**

ఈ సంవత్సరం అత్యుత్తమ కవితకి 1,000 రూపాయలు, యోగ్యతా పత్రం, ఉత్తమ కవితకి 500 రూపాయలు, యోగ్యతా పత్రం, పది మంచి కవితలకు ఒక్కొక్క దానికి 100 రూపాయలు, యోగ్యతా పత్రాలు.

### నిబంధనలు:

కవిత ముప్పై పంక్తులకు మించక సామాజిక స్పృహ కలిగి ఉండాలి. ★ ఇంతవరకూ ప్రచురణ, ప్రసారం కానివి, దేనికీ అనువాదం, అనుక(స)రణ కాని వచన కవితల్ని మాత్రమే పంపాలి. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి. ★ ఒకరు ఎన్ని కవితలైనా పంపవచ్చు. ★ కవితని కాగితంపై ఒకే వైపు రాయాలి. ★ కవిత ఉన్న కాగితంపై తమ పేరు, విలాసం, ఏదీ రాయకూడదు. ★ పూర్తి పేరు, చిరునామా తదితర వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. ★ ఫలితాలు విజేతలకు నేరుగాను, పత్రికా ముఖంగానూ తెలియజేస్తాం. ★ ఎంపికైన కవితలను ప్రచురించే హక్కు రంజనిదే. ★ న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం. కవితలను 30-9-99లోగా మాకు పంపించాలి.

కవితలను పంపవలసిన చిరునామా:
**ప్రధాన కార్యదర్శి,**
**రంజని, తెలుగు సాహితీ సమితి, ఏ.జి. ఆఫీసు,**
**హైదరాబాద్ - 500 004 అనే చిరునామాకు పంపాలి.**